కథాకాలం : 1985

# అనల్పస్వల్పం

ఆకాశం సరికొత్త కరెన్సీ నోటులా ఉంది.

సూరీడు రూపాయికాసల్లే ఆకాశానికి అద్దినట్లు అమిరాడు.

ఎండకు గుండెకాయ లేదు _ ఫెళఫెళ లాడించేస్తోంది.

ఆ ఎండలో లచ్చిగాడికి, చెమట చుక్కల్లాతేలి కొంత దుస్తుల్లోకి, కొంత మళ్లీ శరీరంలోకి ఇంకి పోతోంది. వేల రూపాయల స్కూటర్‌తో వాడివేళ్లు - ఆడుకోటం లేదు. శ్రమపడుతున్నాయి. "నాలుగువేళ్లా నోట్లోకి పోవాలంటే ఆటాపాటా జాన్తానై" అంటూ ఆ భావిభారత పౌరుణ్ణి పనిలో పెట్టాడు తండ్రి. సదరు నాన్న రైస్ మిల్లు దగ్గర

బస్తాలు మోస్తాడు. తల్లి అంట్లు తోముతుంది. అంచేత లచ్చిగాడు పదోయేటే పెద్దాడయిపోవలసి వచ్చింది. ఏళ్ల తరబడి మోస్తున్న బస్తాలు, తోమే అంట్లు మిగల్చలేక పోయిన సంపదని వాడి పేరులో చూసుకొని సంతోషిస్తారు తల్లీ, దండ్రీ.

లచ్చిగాడికి రూపాయి విలువ తెలుసు. వాడికి తెలుసు కాబట్టి రూపాయికి విలువ ఉందనికాదు. రూపాయికి విలువ లేదని వాడికి తెలుసు ననడం సబబు.

వాడు పౌరుడిగా మారి నెల పూర్తికాలేదింకా. మొదటి జీతం ముట్టలేదు.

"నాన్నోయ్.? నా జీతం వెంతేంటి?" అనడిగాడు శ్రీ వెంకటరమణా మోటర్ మెకానిక్స్‌లో పనికి కుదిరిన రోజున.

"సిగ్గలేవోడ్.... ఎదవసన్నాసి నోర్మూసుకుని బుద్ధిగా పవ్నేర్చుకోక జీతంగీతం అంటూ లెక్కలడుగుతావా? సదివించి కలకటేర్ని సేసుంటే... ఇంకెంత పొగరెక్కిపోయి కులికేవాడివో గానె దవోరే .... నీ పన్చెప్తా కాస్కో" అంటూ తండ్రి రెండు దెబ్బలు వేసాడు.

"సచ్చినోడా .... సదుకొంటున్న కుర్రాణ్ణి మానిపిచ్చి పన్లో పెట్టింది కాక .... సర్దాకి అడు తన సెమటకి ఇలువ ఎంతో అడిగితే కొడతావా?; .... నీ సేతు లడిపోనూ" అంటూ అంట్లుతోమి అప్పుడే వచ్చిన తల్లి వో దులుపు దులుపుతూ అంటు కడిగేసింది లచ్చిగాడి కన్న తండ్రిని.

కొడుకుని కొట్టాడని మొగుడిమీద కోపమేగాని లచ్చిగాడు పన్లో కుదిరాడని దానికీ సంతోషంగానే ఉంది. ఏదో వేణ్ణీళ్లకి చన్నీళ్లకాదా

మరి (నిజానికి కాదు మరి! ఎంచేతంటే - కుళాయికుళ్యాలో దొరికే నీళ్లు నాలుగు బిందెలే. స్నానానికి వేణ్ణీళ్లు పెట్టుకుంటే కలపడానికి తక్కిన చన్నీళ్లు చాలవు. చన్నీళ్లకి చన్నీళ్లేగాని వేణ్ణీళ్లకు చన్నీళ్లు అవడాని క్కూడా వీల్లేని సంపద వాళ్ళది!)

ఇంతకీ ఆ రోజుకు అలా అంటకడిగేసినందుకు లచ్చిగాడి అమ్మని వాళ్ల నాన్న బాదేసాడు. జీతమెంతో లెక్క చెప్పమంటున్న కొడుకుని అదికూడా వెనకేసుకురాడాన్ని రాముడు శంకించాడు. కొడుకు జీతం సారానీళ్లకి చీకులల్లే ఉపయోగపడాలని వాడి కోరిక. మూటలు మోసీ మోసీ సారా తాగితాగి చిక్కిపోతున్న తనమీద తనకే జాలీ, కోపం, అసహ్యమూనూ! అసలే అలా తను చిక్కుల్లో ఉండగా లచ్చిగాడు తన ఉద్యోగానికి ఆ వెంకటరమణా మోటారు మెకానిక్స్ నుంచి రాబోయే జీతం మీద తన పెళ్లాం కన్నేసిందని రాముడికి అనుమానం జచ్చేసింది. అందుకని 'వణ్ణం' దగ్గిర కూరెయ్యలేదంటూ తగూ పెట్టుకొని పెళ్లాన్ని పీకపుచ్చుకు గుంజేసి జుట్టు గుప్పిట్లో పట్టుకొని లాగేసి నడుంవంచి వీపుమీద పిడిగుద్దులు గుద్దాడు.

'వోలమ్మో' అంటూ అమ్మ అరుస్తుంటే 'అమ్మోఅమ్మో' అంటూ లచ్చిగాడు అరచి తండ్రితాళ్లకి అడ్డంపడ్డాడు. అమ్మకి అమ్మలేక పోవడం, తనకి ఉండడం, కానీ అప్పుడు తను అమ్మకి ఏమీచేయలేక పోవడం గురించి వాడు బాధపడ్డాడు. అసలు ఈ 'ఎదవగొడవ' అంతకీ కొన్ని రూపాయలు లేకపోవడమే కారణమని ఆనక ఆలోచించిన తరవాత వాడికి తట్టింది. తట్టగానే 'చీచీ రూపాయిలు' అని వాడు అసహ్యం పెంచుకున్నాడు. అవుంటే ఈ దెబ్బలూ, ఏడుపులూ ఏమీ

లేకుండా జరుగుబాటు అయిపోతుందని కూడా వాడు మళ్లీ ఆలోచించాడు. అవును చీచీ రూపాయిలే బలేబలే రూపాయి అని అర్థం చేసుకున్నాడు.

రూపాయికి ఉన్న విలువ (లేదా) లేని విలువ వాడికి ఆ రకంగా తెలిసొచ్చింది.

కానీ తన చెమటకి విలువెంతో మాత్రం ఆరోజున తెలిసిరాలేదు.

ఆ సంగతి తాత్కాలికంగా మరచిపోదాం అనుకున్నాడు. కాని ఆలోచనలు అన్నింటినీ కాదని ఆ ఒక్క విషయం చుట్టూ తిరుగుతున్నాయి అదేం చిత్రమో! అప్పటినించే అందుకే వాడికి ఆకాశం కరెన్సీ నోటులాగా కనిపించడం మొదలు పెట్టింది.

ఆ వెంకటరమణా మోటార్ మెకానిక్స్‌లో చెమట ఖరీదు తెలియకుండా చెమటలు కక్కుకుంటూ పోయాడు. అక్కడ పనిలో లచ్చిగాడి సీనియర్లు ఇద్దరున్నారు. వాళ్లకి రోజు బేటా పగలూ సాయంత్రం రెండర్థ రూపాయలు జూనియర్ లచ్చిగాడికి పావలా, పావలా, వాళ్ల నడిగితే తెలిసింది. తన జీతం ముప్పయి రూపాయలని.

"అల్ల ఆకాశంలో ఆ సూరీడు నీ కెలాగా అగపడతన్నాడూ!" అని అడిగాడు వాహనం రెక్కలు విప్పుతూ సహ సీనియర్ బాలపౌరుణ్ణి.

"మన షాపుకాడ వారానికి రెండు సార్లు మోటార్‌బైక్ రిపేరీకి త్తాడు సూడూ వో దొరబాబు, ప్రతిసారీ స్పీడోమీటర్ వందలు వందలు తిరిగి పోయుంటది. యాభై రూపాయల రిపేరీ పనికి మన షావుకారు వందడిగినా మాటాడకుండా పరుసులోంచి ఇలాగ్గాలాగి అలాగ్గా ఇచ్చేత్తాడు

దొర. ఆ దొర మొకంలాగుంది ఈ సూరీడి మొకం...." అన్నాడు సీనియరు.

ఆ దొర ఎవరో గుర్తు తెచ్చుకోడానికి సూరీణ్ణి కళ్లు చిట్లించి చూస్తూ ....ఆలోచించాడు లచ్చిగాడు. ఊహూ ... తట్టలేదు.

"నాకు మాత్తరం సూరీడు రూపాయి కాసులాగా అగపడతన్నాడు" బండికి తెగిన గేరువైరు లాగుతూ లచ్చిగాడు చాటాడు.

"అదేటది?" సీనియర్ ఆశ్చర్యపోయాడు కొత్త గేరువైరు అందుకుంటూ.

పక్కన కస్టమరు అసహనంగా ఆ ఇద్దర్నీ చూస్తున్నాడు.

"నా జీతం వెంత ?"

"చెప్పాగా - ముప్పయ్ ..."

"నెలకి రోజులెన్ని?"

"తెల్దేటి?! ముప్పయ్."

"మరి నెలకి ముప్పయ్‌సార్లు సూరీడు ఒస్తా పోతా రూపాయిస్తా పోతాడు కాదేటి!"

"అవుసుమీ?!" సీనియర్ ఒప్పుకున్నాడు.

కుర్రాళ్లిలాగే కబుర్లాడుతూ పని తెమల్చకుండా సాగదీస్తారు. కూచోలేక కస్టమరు అవతలకి పోతాడు. అప్పుడు తాగేస్తారు పెట్రోలు, ఈ మెకానిక్కులంతా దొంగలు?!

కస్టమర్ అలా స్వాగతం చెప్పకుంటూ వాచీకేసి ముప్పయ్యోసారి చూసుకుంటుండగా మరో రెండు మోపెడ్లు, ఒక వెస్పా, మూడు విక్కీలూ, నాలుగు మోటర్ సైకిళ్లూ వచ్చి ఆగాయి.

"ఏరా గేరువైరు ఎక్కించలేదేట్రా సన్నాసీ" అంటూ షావుకారు బాగైన బండిఎక్కి ట్రయలు పేరుమీద ఊరంతా తిరిగి రావడం. రావడం రావడం విసురుగా వచ్చి సీనియర్ జుట్టు పట్టుకున్నాడు.

''తెగిన వైరు ఆడు లాగితేగదా నేను ఎక్కించడానికి" అంటూ లచ్చిగాడివైపు వేలు పెట్టి చూపించాడు సీనియరు.

షావుకారు లచ్చిగాడి మీదికి రంకె వేసాడు.

''సన్నా సెదపన్న రెదవొరే .... ఎన్నాళ్ళా వన్నేర్చుకోడానికి''. అంటూ మొలకున్న బెల్టులాగి ఝుళిపించాడు.

''ఇక ఆలస్యం ఎలాగూ అయ్యింది గాని ఈ దౌర్జన్యం దేనికి? అంతలావు తోలు పటకాతోటి కొట్టేస్తే బొట్టెడు ఏమయిపోతాడు? ... అపు .... ఆపాపు'' అంటూ కస్టమరు షావుకారికి లచ్చిగాడికీ మధ్య అడ్డెళ్లి పొరపాట్న బెల్టుదెబ్బ తినేసాడు.

లచ్చిగాడికి దక్కాల్సిన దెబ్బ కస్టమర్‌కి తగలడంతో షావుకారు శివాలెత్తిపోయాడు.

లచ్చిగాడికి తెలిసీ తెలియని భయం ముంచెత్తి వణికిపోయాడు. అంత భయంలోనూ వాడి పదేళ్ళ వయసు తాలూకు 'వాడిబుర్ర' పని చేసింది. ఒక్క గెంతుగెంతి అందకుండా తప్పించుకు తిరిగాడు మర మ్మత్తుకొచ్చిన బళ్లచుట్టూ.

సీనియర్ కుర్రాళ్లిద్దరూ సంతోషిస్తూ ఒక కన్ను అటుంచి రెండో కంటినీ, రెండు చేతుల్నీ పనిమీద ఉంచారు (వాళ్ల సంతోషం జూనియర్ లచ్చిగాడు తినబోయే దెబ్బల్ని తలుచుకుని.)

ఆ పరుగులో కాలు మెలితిరిగి ఓ విక్కీని కింద పారేసాడు లచ్చిగాడు. దానికింద ఇరుక్కుపోయింది వాడి కాలు.

ఆ కాలుకి హృదయం ఉంటే, నోరుంటే అదిక్కడ తప్పనిసరిగా ఓ విషయం చెప్పేది.

'బాబుల్లారా! నేను చిల్డ్రన్‌పార్క్‌లో జారుడుబల్ల ఎక్కేదిదాన్ని కాను. ఎగ్జిబిషన్‌లో జాయింట్ వీల్ కుర్చీకిందికి వేలాడినదాన్ని కాను. పోషకాహారంతో దంతపు బొమ్మలా మెరిసేదాన్ని కాను. అమ్మలూ బొమ్మలూ అబ్బరంగా చూసుకోడాన్ని ఎరిగినదాన్ని కాను. రెండుపూట్లా వేణ్ణీళ్ల స్నానంతో సబ్బు నగిషీతో శుభ్రం అబ్బినదాన్ని కాను. నా చిన్నారి యజమాని శరీరాన్ని మోయలేక చిక్కినదాన్ని. ఈ పరుగులు తీయలేను. ఇప్పుడీ విక్కీ బరువు మోయలేను. ఈ బాధలు ఇక చాలు. ఆ సంతోషా లికరావు. ఇరిగి పోనివ్వండి నన్ను...." అని ఆత్మహత్యా సదృశ్యంగా లచ్చిగాడి కాలు మొర పెట్టుకునేదే!

షావుకారు విక్కీ పైకెత్తి లచ్చిగాణ్ణి చిక్కించుకుని చెవి చేత్తో మెలిపెడుతూ 'శిక్షణ'కి ఉపక్రమించాడు.

"ఎయ్యండి సచ్చినోణ్ణి....నాలుగు తగల్నియ్యండి....పని కొంగెదవ.... తిండికి దండగెదవ," అంటూ రాముడు షావుకారుకి చేతులెత్తి నమస్కరించింది చాలక అరిచి మరీ చెప్పాడు. కొడుక్కి షావుకారిచ్చే జీటా

రెండు పావలాల్లో అనవాయితీగా ఒకటి (బీడీముక్కలకి) దక్కించుకో డానికి అప్పుడే అక్కడికొచ్చాడు వాడు.

అసలు లచ్చిగాణ్ణి పన్లో పెట్టినప్పుడే షావుకారికీ, రాముడికీ మధ్య వాడి జీతం, ఈ దెబ్బలూ గురించి ఓ అన్ రిటెన్ అగ్రిమెంటు కుదిరింది.

"పనోళ్లు ఆడుతూ పాడుతూ పని చేస్తామంటే కుదురుద్దా .... అందుకే అసలు ఆటా పాటా తెలీని పోరగాళ్లని పన్లో పెట్టా. పేకాటో సినిమా పాటో తెలిసిన పెద్దపెద్ద మొద్దుల్ని పెట్టాననుకోండి.... ఆడు ఆటకీ పాటకీ డబ్బులు సాలక నా లాభాల్లోంచి వాటాకొట్టేస్తాడు. అదేలని నిలేస్తే ఆనక మరమత్తుకొచ్చిన ఏదో ఓ బండిని బాగుచేసి ట్రయల్ రన్ ఏసొస్తానంటూ అదేపోక పోతాడు. అందుకే.... అదిగో— నీ పేరేటీ, రాముడా? నీ బుడ్డణ్ణి ఉత్త పున్నేనికి రెండుదెబ్బలు వేస్తే డిజిల్ ఇంజన్లా నామీదదమాక .... ఏటి .... పదంతా శిచ్చణ .... నీ కొడుకు బాగువడ్డానికి నేను రెండు దెబ్బ లెయ్యాలంటే నా సెయ్యి కూడా దెబ్బ తినేస్దికాదా... అందుకే మీ అబ్బిగాణ్ణి నాను కొట్టే దెబ్బలు ఆడికి నేనిచ్చే జీతంలో వో భాగం...." అని షావుకారు ఆనాడే చెప్పి ఉంచాడు.

దెబ్బలు లచ్చిగాడికీ, డబ్బులు తనకీ దక్కేలా రాముడు ఒప్పేసు కున్నాడు. కానీ వెధవ జీతం ఇరవైతొమ్మిది రోజులూ వెళ్లి ముప్పయ్యో నాడు కాని చేతిలో పడదు. మధ్యలో పదీ పరకా అడిగితే షావుకారు అడ్వాన్సు ఇస్తాడు గాని వడ్డీతోసహా పిల్లగాడి జీతంలో కోస్తాడు. సంసారం అన్న తరవాత మోసే మూటలని నమ్ముకుంటే సారాకి ఢోకా!

అంచేత అడ్వాన్సులూ తప్పవు. వడ్డీలూ తప్పవు. అందుగ్గాను ఆ వడ్డీ మేరకి నష్టం పూడ్చడానికి లచ్చిగాడి బేటా డబ్బుల్లో సగం ఒడుక్కుపోతాడు రాముడు.

రోజూ ఆ తండ్రికి కొడుక్కి మధ్య అనుబంధం ఖరీదు కేవలం ఒకే ఒక్క పావలా?

పదేళ్ల లచ్చిగాడు సొంత అనుభవంతో వో ఎక్కం కొనుక్కొన్నాడు.

"ఒక సూర్యుడు ఒక రూపాయి!

ఒక పావలాకి ఒక నాన్న."

కాని అమ్మ వాడి ఎక్కపు రొక్కంలో ఇమడలేదు. పగటి పావలా నాన్న పట్టుకుపోయిన తరువాత ఇంటికెళ్లి అమ్మ తినిపించిన గెంజినీళ్ల తిని (లేదా తాగి) చట్టున మళ్లా పనిలో కొచ్చేస్తాడు లచ్చిగాడు. సాయంత్రం పావలాతో బటాణీలో, పల్లీలో, రస్కులో కొనుక్కొని తినేసి మంచినీళ్లు తాగేస్తాడు.

తను ఆడుకోకుండా పనిచేయడం దేనికి? అని ప్రశ్న వేసుకుంటే లచ్చిగాడికి సమాధానం దొరకలేదు.

ప్రస్తుతం షావుకారు చెవి మెలిపెట్టడం, సీనియర్లు సంతోషించడం, కస్టమరు బెల్టుదెబ్బతిని కుదేలైపోడం, పావలాకోసం వచ్చిన కన్నతండ్రి షావుకారు చేతిలో బెల్టు తనచేతిలో లేనందుకు బాధపడుతున్నట్టు చూడ్డం— ఇన్ని ప్రమాదాల మధ్య ఇరుక్కుపోయిన తనకి విక్కికింద నలిగిన కాలు .... తెగనొప్పి ....

లచ్చిగాడికి కన్నీళ్ళొచ్చాయి.

ఆకాశంలోకి చూస్తే కన్నీటి చారికల్లోంచి సూరీడు చెల్లని రూపాయిలా, ఆకాశం తడిసి చిరిగి పోయిన నోటులా కనపడింది.

రూపాయి ఎన్ని బాధలు పెట్టగల్దో తెలిసొస్తోంది.

రోజుకొక్క రూపాయికే ఇన్నోటి కస్టాలయితే "సేతల ఓ నూర్రూపాయల నోటుంటేనో" అని ఓ భయం గుండెలో గుబిల్లుమంది.

షావుకారు 'శిక్షణ' యధావిధి పూర్తిచేసాడు.

నాన్న పావలా పట్టుకుపోయాడు.

కష్టమరు బండికి గేరువైరు అమిర్చి ఐదురూపాయల నోటు షావుకారు జేబులోకి వెళ్లిపోయింది.

కానీ --

లచ్చిగాడి చేతులకి చెయ్యాల్సిన పనీ, కాలుకి తగ్గాల్సిన నెప్పీ చాలా ఉండిపోయింది.

లచ్చిగాడు భయపడ్డంతా అయింది. వాడిచేతిలోకి నూర్రూపాయల నోటొచ్చింది.

అదెలా జరిగిందంటే -

వారానికి రెండుసార్లు రిపేరుకి బండిని పట్టుకొచ్చే దొరబాబు ఆ రోజొచ్చాడు. సూరీడెలా ఉన్నాడ్రా అని క్రితంరోజు సీనియర్నడిగితే ఈ దొరబాబు మొకంలాగుంటుందని సీనియర్ చెప్పిన సంగతి లచ్చిగాడికి గుర్తుకొచ్చింది.

ఈ దొరబాబు దొరబాబులానే ఉన్నాడు కాని సూరీడిలా మాత్రం లేడు అని లచ్చిగాడనుకున్నాడు. సూరీడు రూపాయి కాసయితే, ఈ దొరబాబు ఆ రూపాయికాసుకి తిరుగులేని ప్రొప్రైటరులాగున్నాడు.

"అర్జెంటుపనులు చాలా ఉన్నాయి. బండి పాడైపోయి పన్లన్నీ ఆగిపోయాయి. నిమిషాలమీద బండి రిపేరు చేసిచ్చేయాలా" దొరబాబు తొందర పెట్టాడు.

"కొట్లో షావుకారు లేడు మరి" అని జవాబిచ్చాడు లచ్చిగాడు.

"షావుకారొచ్చే దాకా నా అర్జెంటుపన్లు ఆగవు. అయ్యొచ్చేదాకా అమాస ఆగుద్దా?" దొరబాబు తొందర తొందర పెట్టేస్తున్నాడు.

"రిపేరీ అయితే మేము చేస్తామనుకోండి. షావుకారు సెప్పాల కదా ఎంతవుద్దో ఏటో".

దొరబాబుకి ఒళ్లు మండిపోయినట్టుంది. డబ్బంటే నాకు లెక్కలేదు రోయ్ అని చెప్పడానికన్నట్లు లచ్చిగాడి మీదికి దూకి రెక్కపుచ్చుకుని చెవి మెలిపెట్టి "ఇదిగో వందనోటు అడ్వాన్సు. రెండుగంటల్లో మళ్లొస్తాను. బండి రెడీగుండాల. అప్పటికి మీ షావుకారు ఒస్తే సరేసరి. రాకపోతే మరేం బయ్యంలేదు - లెక్కలూ గొక్కలూ మీ షావుకారు నేనూ చూసుకుంటాం. ఇక అందుకోండి రెంచి...." అని లచ్చిగాడి జేబులో వందనోటు కుక్కి అర్జంటు పనులు ఆగిపోయినందుకు కంగారుతోనో, మరెందేతో చెమట్లు కక్కుకుంటూ వగరుస్తూ వెళ్లిపోయాడు దొరబాబు.

సీనియర్లూ, లచ్చిగాడూ కలిసి బండిని పెదరెక్కలు విప్పి దాన్ని శల్యపరీక్ష చేసారు.

ఇంజన్ స్టార్ట్ చేసాడు లచ్చిగాడు.

"తెలీటంలే ... ప్రెషర్ లీకేజి'' అన్నాడు సీనియర్.

"పిస్టన్ రింగ్సు మార్చాలా'' లచ్చిగాడు లోపం కనిపెట్టేసిన హుషారుతో అడిగాడు సలహా.

అద్గదీ.... కరక్టు....

బండి మరమ్మత్తు అయిపోయింది.

ఆ రోజు ఇద్దరు సీనియర్లలో ఒకడు డ్యూటీ దిగిపోయాడు. రెండో వాడు ఆ రోజు బేటా డబ్బులతో శ్రమని దించుకోడానికి 'కాఫీ హోటేలు'కి వెళ్లాడు.

షావుకారు రాకకోసం ఎదురుచూస్తూ షెడ్డు మొత్తానికి కాపలాగా తానుండి పోయాడు లచ్చిగాడు.

వాడిజేబులో వందరూపాయల నోటు.

జేబులో వంద సూర్యుళ్లని పెట్టుకొన్నట్లు చికాగ్గా ఉంది వాడికి.

వందరూపాయలు వాడి చిన్న జీవితపు కోణంలోంచి బేరీజు వేసు కోడంచేతనే కాబోలు ఆ చికాకు.

సంతోషం కూడా చిన్నగా మొదలైంది వాడికి --- వందనోటుని చేత్తో ముట్టుకున్నందుకు!

వేలు, లక్షలు, కోట్ల రూపాయల గురించి వాడు విన్నాడు.

కాని వంద రూపాయల నోటుని తన చేత్తో అందుకోడం అదే మొదటిసారి.

షెడ్డులోపలికెళ్లి అటూ ఇటూ చూసి, ఎవరూ లేరని నిర్ధారించుకుని, జేబులోంచి వందనోటు పదిలంగా బైటకుతీసి గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

అప్పుడు చట్టున వాడికో సంగతి గుర్తుకొచ్చింది. ఇదివరకు ఓ సాయంత్రం వేళ తను పాకలోకి వెళ్లినప్పుడు.... అమ్మని పక్కింటి తాపీమేస్త్రీ గట్టిగా పట్టుకుని ముద్దుపెట్టుకోడం, అమ్మ అరవకపోగా మేస్త్రీని అదిమిపట్టుకుని మరోసారి ముద్దు పెట్టించుకొని మేస్త్రీ చేతిలోంచి ఆబగా ఓనోటు అందుకోటం, వాళ్లిద్దరూ చూడకముందే తను పాక బైటికి గెంతి పారిపోవడం ....

సరిగ్గా అప్పుడు గుండెలు ఎలా కొట్టుకున్నాయో ఇప్పుడూ అలాగే కొట్టుకున్నాయి.

కాస్త ఆలోచిస్తే ఎందుకో తట్టింది వాడికి.

ఈ వందరూపాయలు తనవి కావు.

అలా అనుకోగానే కించిత్తు విచారం కలిగింది వాడికి.

షావుకారుకిమ్మని కష్టమరు దొరబాబు ఇచ్చాడు ఈ నోటు.

నిజానికి ఈ నోటుమీద షావుకారు పేరూ లేదు, దొరబాబు పేరూ లేదు. ఉన్నా తను చదవలేడు కాని లేదని గ్యారంటీగా చెప్పేయ్‌గల్డు.

"నిజానికి ఏ నోటు ఎవడిచేతిలో ఉంటే అడిదే!" అని అనుకున్నాడు. కాదనికూడా ఈనోటుమీద రాసిలేదు. అవుననికూడా రాసిలేదని మనసు ఘోషించింది.

ఇలాటి నోటు ఒకటి తను నాన్న మొహాన్న పారేస్తే పావలా బేటా డబ్బులు ఒడుక్కోడానికి తన చుట్టు తిరగడం ఇక మానేస్తాడా?

సరిగ్గా ఇలాటి నోటు అమ్మమొకాన ఇసిరేస్తే మేస్త్రీకి దొంగచాటు ముద్దులూ అవీ ఇవ్వడం ఆపేస్తుందా?

పెద్దవర్షం పట్టుకున్నట్టు -

అందులో చిక్కడిపోయి తడుస్తూ నడుస్తున్నట్టు -

వడగళ్లు మొదలైనట్టు -

ఒక్కోటీ ఒక్కో సూదంటు రాయిలా నెత్తిని అవి మొత్తేస్తున్నట్టు-

ఏవేవో ఆలోచనలు ముసిరేసాయి వాణ్ణి. ఈ వందరూపాయనోటుని కాగితం పడవలా చేసి ఆ వర్షపునీటిలో వదిలి అది వేగంగా పరిగెట్టి నంత దూరం తాను చప్పట్లు కొడుతూ ఉరకవేసినట్టు కూడా కలగన్నాడు.

నాన్న పెద్ద రాక్షసుడి వేషంలో మూటలు మోస్తూవచ్చి ఆ మూట లన్నీ తనమీద పారేసి, ఆ వందనోటు "ఇలగిచ్చీరా! ఇలగిచ్చీ" అంటూ తన చేతిలోంచి లాక్కున్నట్టు! "ఇది షావుకార్ది. కష్టమరిచ్చిన బయానా. నాను ఈ డబ్బుకి జవాబ్దారీ. నానియ్యనంటే ఇయ్యను" అని తాను పెనుగులాడినట్లు, ఈ గొడవలో నోటు చినిగిపోయినట్టు పీడ కలలాంటి ఆలోచనొచ్చింది మళ్ళా.

అంతే గుండె రుభిల్లుమంది !!

నోటుని భద్రంగా తడిమి అది చిరిగిపోనందుకు, పెళపెళలాడు తున్నందుకు సంతోషించాడు. అంతలో ....

"ఏ్రా .... ఎక్కడ సచ్చా్రా అంతానూ -"

- ఓ పొలికేక వినిపించింది. ఒచ్చేసాడు షావుకారు. అందర్నీ ఇదిగో వీడే నమలి మింగేసి దొంగలా షెడ్డులో దాంకున్నాడా అన్నట్లు లచ్చిగాడికేసి పులిచూపు చూసాడు షావుకారు వస్తూనే. టౌన్లో ఇలాంటి షెడ్లు మూడున్నాయి షావుకారికి. మూడింటినీ లైన్లో పెట్టడానికి తిరుగుతూంటాడు.

వందనూరీళ్ల బరువు దించేసుకునే తహతహలో జవాబ్దారీగా షావు కారుకేసి చూసి వినయంగా వందనోటుని పట్టుకుని నిలబడ్డాడు లచ్చిగాడు.

షావుకారు వచ్చినంత హడావుడిగా మళ్లీ వెళ్ళడానికి ఓ జావా ఎంచుకొని కిక్ కొట్టాడు.

నాకు పనొచ్చేసింది. అదీగాక నిజాయితీ మనిషి న్నేను - అని చాటు తున్నట్టు దర్పంగా కానీ సవినయంగా లచ్చిగాడు జావాకి అడ్డెళ్ళాడు.

"దొరబాబు బండి రిపేరీకొచ్చింది.... పిస్టన్ రింగ్స్ మార్చాం.... అడ్వాన్సిచ్చాడు.... ఇదిగో వంద-" అంటూ నోటు చూపించాడు.

"సర్లే. అదక్కడెట్టు .... మాళ్లొస్తా" అంటూ షావుకారు స్రరున దూసుకు పోయేడు బండి మీద.

ఆ వెనక పొగ దుమ్ము, దూళిలో ఉక్కిరి బిక్కిరయి పోయింది లచ్చిగాడి చిన్ని రూపాయి ప్రపంచం!